


యుటిఎఫ్ దీక్ష విరమణ



చిత్తూరు జిల్లా కేంద్రంలో ఆర్డీవో కార్యాలయం వద్ద రెండో రోజూ నిరాహారదీక్ష కొనసాగింది. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.సోమశేఖర్‌నాయుడు, రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ నాయకత్వం వహించారు. గురువారం సాయంత్రం దీక్ష విరమించారు. ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు అందజేయాలని, పాత పెన్షన్ పునరుద్ధరించాలన్నది వీరి ప్రధాన డిమాండ్లు.

ఎన్నికల బడ్జెట్



- ఆదాయ పన్ను వర్గాలకు లభించని ఊరట
- వ్యవసాయానికి అత్తెసరు నిధులే...
- రాయలసీమ తలమానికమైన 'ఉక్కు' ఊసేలేదు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

కేంద్ర బడ్జెట్ నిరాశను మిగిల్చింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 ఓట్ ఆన్ బడ్జెట్‌ను గురువారం సుమారు రూ.47.66 లక్షల కోట్లతో ప్రవేశపెట్టారు. రాయలసీమకు తలమానికంగా రాష్ట్ర విభజన చట్టంలోని హామీలైన ఉక్కు పరిశ్రమకు నిధుల కేటాయింపే లేదు. రూ.2.55 లక్షల కోట్లతో రైల్వేబడ్జెట్ ప్రస్తావన చేసింది. ప్రాజెక్టుల వారీగా కేటాయింపుల వివరాలు తెలియడం లేదు. రైల్వే బడ్జెట్‌లోనూ కడప-బెంగళూరు రైల్వేలైన్ సహా పెండింగ్ రైల్వే ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుల ప్రస్తావన చేయలేదు. విభజన హామీలను పూర్తిగా విస్మరించింది. కార్పొరేట్ల ప్రోత్సాహకాలు, పాడి రైతుల ప్రోత్సాహానికి ప్రత్యేక పథకాన్ని ఉటంకించింది. వేతనజీవులను నిరాశ పరిచింది. రైతుల ఆదాయం రెట్టింపు చేయడాన్ని విస్మరించి అధికం చేస్తామని పేర్కొంది. గతేడాది వ్యవసాయానికి కేటాయించిన రూ.1.25 లక్ష కోట్లకు రూ. రెండు లక్షలను జత చేసి అత్తెసరు కేటాయింపులకు పరిమితం కావడం విస్మయాన్ని కలిగించింది. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఐఐటి, ఐజర్, రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయాలకు నిధుల కేటాయింపులో స్పష్టత లేదు.

ఆదాయ పన్ను వర్గాలకు స్లాబులు యథాతథం

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ త్వరలో జరగనున్న ఎన్నికల బడ్జెట్‌గా ఉందని, అంతా అబద్దాలతో నిండి ఉందని ప్రతిపక్షాలు భగ్గుమంటున్నాయి. ఎంతో ఆశగా ఎదురుచూసిన ఆదాయ పన్ను వర్గాలకు స్లాబులు యథాతథంగా ఉండడంతో ఉద్యోగ ఉపాధ్యాయుల్లో ఏమాత్రం ఊరట లభించని పరిస్థితి. పన్ను స్లాబుల్లో ఎలాంటి మార్పూ లేదని నిర్మలా సీతారామన్ వెల్లడించారు. అయితే వచ్చే ఐదేళ్లలో స్వర్ణయుగం కానుందని, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరిస్తుందని పేర్కొనడం ప్రజల చెవిలో పువ్వు పెట్టడమే. 3-6 లక్షల మధ్య ఆదాయంపై ఐదు శాతం, 6-9 లక్షల మధ్య 10శాతం, 9-12 మధ్య 15శాతం, 12-15 లక్షల మధ్య 20శాతం, 15 లక్షల కంటే ఎక్కువ ఆదాయం ఉంటే 30శాతం పన్ను విధించనున్నారు. కొత్త పన్ను విధానంలో పన్ను రేట్లు అన్ని వర్గాలకు, సీనియర్ సిటిజన్లకు, సూపర్ సీనియర్ సిటిజన్లకు ఒకేలా ఉంటాయి. పాత పన్ను విధానంలో రూ.2.5 లక్షల వరకూ ఆదాయ పన్ను మినహాయించబడింది. 2.5 నుంచి 5 లక్షల మధ్య శాతం పన్ను విధిస్తున్నారు. అలాగే 10 లక్షలకు పైబడిన వ్యక్తిగత ఆదాయంపై 30శాతం పన్ను విధిస్తున్నారు. పాత పన్ను విధానంలో ఆదాయ పన్ను మినహాయింపు పరిమితి సీనియర్ సిటిజన్లకు 3 లక్షల వరకు ఉంటుంది. సూపర్ సీనియర్ సిటిజన్లకు ఐదు లక్షల వరకు ఉంటుంది. దేశవ్యాప్త ంగా 83 లక్షల స్వయం సహాయక సంఘాల్లోని తొమ్మిది కోట్ల మంది మహిళలకు మేలు చేస్తామని పేర్కొంది. వీరితోపాటు దేశంలోని అంగన్వాడీలు, ఆశా లను ఆయుష్మాన్‌భారత్ పరిధిలోకి తీసుకుని రావడం కొంత ఉపశమనాన్ని కలి గించింది.

సుదీర్ఘ, స్ఫూర్తిదాయక పోరాటం

టిటిడి అటవీ కార్మికుల ఘన విజయం



పరిపాలనా భవనం వద్ద ప్రసంగిస్తున్న కందారపు మురళి

అటవీ కార్మికులతో దీక్ష విరమింపజేస్తున్న కరుణాకర్‌రెడ్డి

- టైంస్కేలు వర్తింపజేస్తూ 8వేలు వేతనం పెంపు
- టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి వెల్లడి
- నిత్యం అండగా అఖిలపక్ష, పౌరసమాజం
- 38 నెలల నిర్విరామ రిలే నిరాహార దీక్ష ముగింపు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పోరాడుతున్న అటవీ కార్మికులను టిటిడి శ్రీలక్ష్మీ శ్రీనివాస కార్పొరేషన్ నుంచి మినహాయించామని, వారికి టైం స్కేల్ వర్తింప చేస్తూ వేతనాలు పెంచు తున్నామని టీటీడీ బోర్డు ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ప్రకటించారు. దీంతో 38 నెలలుగా అటవీ కార్మికులు చేస్తున్న నిర్విరామ రిలే నిరాహారదీక్షలను విరమించారు. ఎట్టకేలకు తిరుమల శ్రీవారి పాదాల చెంత బలహీనుల ఆక్రందనకు న్యాయం జరిగింది. బక్కచిక్కిన శరీరాలు అలిసిపోయినా విరామం ఎరుగక సుదీర్ఘకాలం వీరు జరిపిన పోరాటం స్ఫూర్తిదాయకంగా టిటిడి చరిత్రలో నిలిచిపోయింది.

సిఎం జగన్ ఇచ్చిన హామీ నెరవేర్చాలంటూ గత 38 నెలలుగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్న అటవీ కార్మికులు, సమస్యను టిటిడి పట్టించుకోని పక్షంలో న్యాయం కోసం జనవరి 27 నుంచి నిరవధిక నిరాహారదీక్షను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి నేతృత్వంలో ప్రారంభించారు. 29న అర్ధరాత్రి టిటిడి పోలీసులను ఉసిగొల్పి అరెస్టు చేయించడంతో, మరో బృందం పట్టువీడక నిరవధిక నిరాహారదీక్షను కొనసాగించింది. గత ఆరు రోజులుగా సాగుతున్న నిరవధిక నిరాహారదీక్షలు తీవ్ర ఉద్రిక్త పరిస్థితిని సృష్టించాయి. ఈ నేపథ్యంలోనే సిఐటియు ఆధ్వర్యంలో గురువారం టిటిడి పరిపాలనా భవనం వద్ద రాజకీయ పార్టీలు, పౌరసమాజ ప్రముఖులు సంఘీభావంగా నిరాహారదీక్షకు పూనుకున్నాయి.

చర్చలు జరిగిన తీరు

టిటిడి పాలకమండలి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డి జోక్యంతో జెఇఒ వీరబ్రహ్మం, లక్ష్మీ శ్రీనివాస కార్పొరేషన్ సిఇఒ శేషశైలేంద్ర, టిటిడి ఫారెస్టు డిఎఫ్ఒ శ్రీనివాసులు యుద్ధప్రాతిపదికన గురువారం మధ్యాహ్నం సిఐటియు నేతలు కందారపు మురళి, టి.సుబ్రమణ్యం, అటవీ కార్మికులతో చర్చలు జరిపారు. చర్చలలో మౌలికమైన డిమాండ్ లక్ష్మీ శ్రీనివాస కార్పొరేషన్ నంఉచి కార్మికులను మినహాయించాలని నేతలు కోరడంతో టిటిడి యాజమాన్యం అంగీకరించింది. పర్మినెంట్ తమ పరిధిలో లేని అంశం కనుక కార్మికులకు టైంస్కేల్ వర్తింపజేస్తామని, 2023 పిఆర్‌సి ప్రాతిపదికన 20వేల రూపాయల బేసిక్‌తో 22,600 వేతనం చెల్లిస్తామని అధికారులు ప్రతిపాదించారు. నేతలు పునరాలోచన చేయాలని కోరడంతో టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి జోక్యం చేసుకుని కార్మికులకు మరో 3,125 రూపాయలు వేతనం పెంచుతూ, ప్రతి రెండేళ్లకోసారి ఒక్కో కార్మికునికి 25మొక్కల పెంపకం బాధ్యతను అప్పగిస్తున్నట్లు చెప్పారు. ఇంచుమించు పర్మినెంట్ కార్మికుల వేతనానికి దగ్గరగా ఉండడంతో చర్చలు సఫలమయ్యాయి.

దీక్షలు విరమింపజేసిన టిటిడి ఛైర్మన్

టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి సాయంత్రం 6 గంటలకు హరే రామ హరే కష్ణ రోడ్డులోని నిరాహార దీక్షా శిబిరం వద్దకు నేరుగా వచ్చి పై ప్రకటన చేశారు. నిరాహార దీక్షలో ఉన్న కార్మికులను పేరుపేరునా పలకరిస్తూ నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింప చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ తిరుపతి నగరంలోని వివిధ రాజకీయ పక్షాలు, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలతో పాటు తిరుపతి ప్రముఖుల అపూర్వమైన మద్దతు ఈ ఉద్యమానికి లభించిందని అందరికీ ధన్యవాదాలు తెలిపారు. టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డిలు సమస్య పరిష్కారానికి చొరవ చూపారన్నారు.

నిరాహారదీక్షల్లో 'మేము సైతం'

తాజాగా జరిగిన టిటిడి పాలకమండలిలో ఎటువంటి నిర్ణయం చేయకపోవడం, బుధవారం సాయంత్రం వరకూ టిటిడి నుంచి ఎటువంటి సానుకూల ప్రకటన ప్రకటించని నేపథ్యంలో గురువారం 'పౌరసమాజం', రాజకీయ పక్షాల ఆధ్వర్యంలో సంఘీభావ దీక్షలకు పూనుకున్నారు. ఈ దీక్షల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి వి. నాగరాజు, రిపబ్లికన్ పార్టీ నేత పూతలపట్టు అంజయ్య, తెలుగుదేశం పార్టీ నేత ఆర్సీ మునికష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు నాగేష్, వెంకటాచలపతి, బాలసుబ్రమణ్యం, జై భారత్ పార్టీ నాయకురాలుముని లక్ష్మి, సాకం నాగరాజు, సీనియర్ జర్నలిస్టు రాఘవ శర్మ, తమటం రామచంద్రారెడ్డి, డాక్టర్ బాలాజీ, డిఎంసి భాస్కర్ లతో పాటు సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం, నేతలు టి. సుబ్రమణ్యం, వేణు, జయచంద్ర, మాధవ్, ఆర్ లక్ష్మి, రఘు, బుజ్జి, నాగ వెంకటేష్, ముని రాజా, చిన్నా తదితరులు పాల్గొన్నారు. ఉద్యమానికి సహకరించిన అందరికీ అటవీ కార్మిక నేతలు ఈశ్వర్ రెడ్డి, సురేష్‌లు ధన్యవాదాలు తెలిపారు.



దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి

తిరుపతి అర్బన్ ఎస్‌పి బదిలీ



ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఎన్నికల బదిలీల్లో భాగంగా తిరుపతి అర్బన్ ఎస్‌పి పరమేశ్వర్‌రెడ్డి ఒంగోలుకు బదిలీ అయ్యారు. ఒంగోలు ఎస్‌పి మల్లికా గార్గ్ తిరుపతికి బదిలీపై రానున్నారు.

జానపద వృత్తి కళాకారుల పోరాటం

సాకారమైన అఖండ శివనామ సంకీర్తన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

జానపద వృత్తి కళాకారుల పోరాటం ఎట్టకేలకు ఫలించింది. 'స్వయంభు' చెంత అఖండ శివనామ సంకీర్తన చేసేందుకు ఆమోదం లభించింది. స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రాంగణంలోని సాంస్కతిక కళావేదికపై గురువారం జానపద వత్తి కళాకారుల అఖండ శివనామ సంకీర్తన కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకరస్వామి ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తిరుపతి జిల్లా జానపద వృత్తి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో తిరుమల తరహాలో ముక్కంటి చెంత అఖండ శివనామ సంకీర్తన జరపాలంటూ ఏడాది పాటు పోరాటం చేసిన సంగతి తెలిసిందే. వీరికి తిరుపతి అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకర స్వామి సంపూర్ణ మద్దతు తెలిపి పోరాటం ముందుకెళ్లేందుకు సహకరించారు. దీంతో అఖండ శివనామ సంకీర్తన చేసేందుకు ఆలయం అనుమతినిచ్చింది. ఆ మేరకు తిరుపతి, నెల్లూరు జిల్లాలకు చెందిన జానపద వృత్తి కళాకారులు శివనామస్మరణలతో సాంస్కతిక కళావేదికను హోరెత్తించారు. జానపద వత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బంగారు మురళి, జిల్లా కన్వీనర్ సంక్రాంతి వెంకటయ్య, గెడి వేణు తదితరులు పాల్గొన్నారు.



ఇంటిపట్టాలిచ్చి 'పుణ్యం' కట్టుకోండి!

ప్రజాశక్తి - రేణిగుంట

రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీలోని గుట్టపై పది రోజులుగా ఎండల్లో ఎండుతూ, చలికి వణుకుతూ ఉన్నామని, పాలకులు, అధికారులు ఇంటి పట్టాలిచ్చి పుణ్యం కట్టుకోవాలని పేదలు వాపోతున్నారు. గురువారం వేలాది మంది గుడారాల వద్దనే నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మాజీ వార్డు మెంబర్ సత్యశ్రీ మాట్లాడుతూ జగనన్న పాలన వచ్చి నాలుగున్నరేళ్లు దాటినా ఇంటి జాగా చూపించలేదన్నారు. ఇంటి పట్టా ఇచ్చి జాగా చూపించకుండా పేదలను మోసం చేశారన్నారు. ఇల్లు లేని నిరాశ్రయులు వేలాదిగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దరఖాస్తు చేసిన వెంటనే ఇంటి జాగా చూపిస్తామని చెబుతున్న పాలకులకు తమ గోడు వినిపించదా? అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఇక్కడున్న నాలుగువేల మందికి ఇంటిపట్టాలు ఇప్పించాలని డిమాండ్‌చేశారు.



కరూర్ వైశ్యాబ్యాంక్ మూడు శాఖలు ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కరూర్ వైశ్యాబ్యాంక్ మూడు నూతన శాఖలను బుధవారం ప్రారంభించింది. తమిళనాడులో రెండు, ఆంధ్రప్రదేశ్‌లో ఒకటి ఉన్నాయి. దీంతో బ్రాంచి నెట్‌వర్కు 834కి పెరిగింది. నంద్యాల జిల్లా ఆత్మకూరులో 832వ శాఖను ఆత్మకూర్ మున్సిపల్ కమిషనర్ పి.శ్రీనివాసరావు ప్రారంభించారు. తమిళనాడు జిల్లా ఉసిలంపట్టిలో 833వ శాఖను మున్సిపల్ కమిషనర్ జె.గాంధీ, తమిళనాడులోని మాధూర్ 834వ శాఖను చెన్నయ్ ఎవర్విన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ సీనియర్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పురుషోత్తమన్ ప్రారంభించారు. బ్యాంకు మొత్తం వ్యాపారం 2023, డిసెంబర్ 31 నాటికి 1,58,357కోట్లు ఉంది. వీటిలో డిపాజిట్లు రూ. 85,665 కోట్లు, అడ్వాన్సులు రూ.72,692 కోట్లుగా ఉంది.



'ఆడుదాం ఆంధ్రా' విజేతలకు బహుమతులు ప్రదానం



ప్రజాశక్తి -తిరుపతి సిటీ

'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీల్లో విజేతలకు గురువారం బహుమతి ప్రదానం చేశారు. స్థానిక తారకరామా స్టేడియంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, తిరుపతి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఎలమంచిలి ప్రవీణ్ గౌరవ అతిథులుగా విచ్చేసి గెలుపొందిన టీం లకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎపుడూ జగన్మోహన్ రెడ్డి వినూత్న కార్యక్రమాల్ని చేపడతారని, దానిలో భాగంగా ఆడదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహించడం ద్వారా గ్రామీణ క్రీడాకారులకు తమ ప్రతిభ చాటుకునే అవకాశం వచ్చిందన్నారు. తిరుపతి జిల్లా క్రీడా అధికారి సయ్యద్ సాహెబ్ మాట్లాడుతూ గెలుపొందిన జట్లు విశాఖపట్నం నందు జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని, అక్కడ గెలుపొందిన వారికి మొదటి స్థానంగా 5 లక్షల రూపాయలు ప్రైజ్ మనీ ,రెండవ స్థానానికి రెండు లక్షలు, మూడవ స్థానానికి లక్ష రూపాయలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందజేస్తారని తెలిపారు.. ఈ కార్యక్రమంలో డైనమోస్ ఫుట్బాల్ క్లబ్ సీనియర్ మెంబర్ రమణ, ఎన్ఐఎస్ కోచ్ లు జి మాలిని, హిందూజా ,గోపి ప్రేమ్, వినోద్ పాల్గొన్నారు.

25వ రోజుకు న్యాయవాదుల దీక్ష

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ప్రజలకు ఇబ్బంది కలిగించేలా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారం 25వ రోజుకు చేరుకుంది. జిల్లా కోర్టు సముదాయాలు వద్ద నిర్వహిస్తున్న న్యాయవాదుల నిరాహార దీక్ష శిబిరాన్ని ఉద్దేశించి న్యాయవాదులు ఎన్ఎం మణి, దివాకర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ భూ హక్కు చట్టం 2022 ప్రజల ఆస్తులకు భద్రత లేకుండా పోతుందన్నారు. ప్రజలు తమ ఆస్తులు సైతం రెవెన్యూ అధికారుల దయాదాక్షిణ్యాలతో అనుభవించవలసిన పరిస్థితి ఏర్పడడం సరైనది కాదన్నారు. ఈ భూచట్టంపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉషారాణి, నాగభూషణం, మమత, నాగరాజు, బాలకష్ణ, న్యాయవాదులు పాల్గొన్నారు.



ఏ నిమిషానికి ఏ ప్రకటనో..

రోజుకొకరిని అభ్యర్థిగా గుర్తింపు
సత్యవేడు 'వైసిపి'లో గందరగోళం

ప్రజాశక్తి - పిచ్చాటూరు

సిట్టింగ్ ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం ప్రస్తుతం ఉన్నారు. అయితే సర్వే నివేదికల్లో సిట్టింగ్ ఎంఎల్ఎకు అనుకూలంగా లేదని చెప్పి తిరుపతి ఎంపి అభ్యర్థిగా కోనేటి ఆదిమూలంను పంపించారు. అక్కడ సిట్టింగ్ ఎంపిగా ఉన్న మద్దెల గురుమూర్తిని సత్యవేడు అసెంబ్లీ ఇన్‌ఛార్జిగా నియమించారు. రెండు రోజుల పాటు గురుమూర్తి నియోజకవర్గమంతా కలియ తిరిగారు. అయితే ఇక్కడా ఆదిమూలం అనుచరగణం గురుమూర్తి సభలకు హాజరు కాలేదు. 'స్థానికంగా' ఉన్న తనకు ఎంఎల్ఎ టిక్కెట్టే కావాలని మంత్రి పెద్దిరెడ్డిని కోరినా పట్టించుకోకపోవడంతో, ఆదిమూలం కొడుకుతో సహా వెళ్లి టిడిపి యువ నేత నారా లోకేష్‌తో మంతనాలు జరిపినట్లు సోషల్ మీడియా వేదికగా హల్‌చల్ అయ్యింది. దీంతో మంత్రులు హుటాహుటిన ప్రెస్‌మీట్ పెట్టి కోనేటి ఆదిమూలంపై గుర్రుమన్నారు. జీడీనెల్లూరుకు చెందిన ఎన్.రాజేష్‌ను తిరుపతి ఎంపి బరిలో దింపుతారని వార్తలొచ్చాయి. తాజాగా క్యాబినెట్ సమావేశం అనంతరం ఉన్నట్టుండి మద్దెల గురుమూర్తిని ఎంపి స్థానానికే నిర్ణయిస్తూ 'యు' టర్న్ తీసుకున్నారు. సత్యవేడును ఎన్.రాజేష్‌కు బాధ్యతలు అప్పగించారు. ఇలా ఏ రోజు ఎవరిని ఇన్‌ఛార్జిలుగా నియమిస్తారో తెలియక సత్యవేడు వైసిపి శ్రేణులు అయోమయంగా ఉన్నారు. రిజర్వుడు స్థానాలుగా ఉన్న సత్యవేడు అసెంబ్లీ, తిరుపతి పార్లమెంట్ స్థానాల్లో అధిష్టానం ఈ విధంగా పిల్లిమొగ్గలు వేయడం పట్ల ఆ శ్రేణుల్లో ఒకింత గందరగోళం నెలకొంది. ప్రస్తుతం సత్యవేడు బాధ్యతలు అప్పగించిన ఎన్.రాజేష్ సైతం 'నాన్ లోకల్'. మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మకు కొడుకు వరుస. పెద్దిరెడ్డి అనుచరగణం. ఓ నాయకుని బరిలో దింపేముందు ఆ ప్రాంతం స్థితిగతులు, పరిస్థితులు, అక్కడి సమస్యలు, అవసరాలు, అక్కడి వనరుల ప్రాముఖ్యతపై అవగాహన ఉన్న వారిని బరిలో దింపాలన్న విషయంలో ఈ గందరగోళం ఏంటన్నది అర్థం కాని పరిస్థితి. వైసిపి పరిస్థితి ఇలా ఉంటే టిడిపిలో ఇంతవరకూ అభ్యర్థిని ప్రకటించడంలోనూ లోపం కనిపిస్తోంది.



జీడీనెల్లూరులో గుమ్మడి కుతూహలమ్మకు నివాళి అర్పిస్తున్న ఎన్.రాజేష్

తిరుపతిలో మినిస్టర్ వైట్ క్లాతింగ్ ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తమిళనాడులో ప్రసిద్ధి చెందిన మినిస్టర్ వైట్ క్లాతింగ్ను ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో తిరుపతిలో మొట్టమొదటిసారిగా గురువారం ప్రారంభించారు. స్థానిక అన్నమయ్య సర్కిల్ వద్దనున్న ఆ షోరూం ప్రాంగణంలో మినిస్టర్ వైట్ అధినేత ఎస్ పల్లంరాజు మాట్లాడుతూ 2015 వ సంవత్సరంలో తమిళనాడులో తమ షోరూమ్ ని ఏర్పాటు చేశామన్నారు. అప్పటినుంచి అంచలంచెలుగా ఎదుగుతూ తమిళనాడు వ్యాప్తంగా 14 షోరూమ్లు, కేరళ రాష్ట్రంలో ఒక షో రూమ్ను ఏర్పాటు చేసి, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటిసారిగా యాత్రిక స్థలమైన తిరుపతిలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. రాబోవు రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లో కలిపి 20 షోరూమ్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకెళుతున్నామని తెలిపారు. తమ షోరూమ్‌లో పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు నాణ్యమైన వైట్ బట్టలు లభిస్తాయన్నారు. కాటన్ షర్టులు 400 నుంచి 5వేల రూపాయల వరకు, సాధారణ షర్టులు 200 నుంచి 5000 రూపాయల వరకు, కిడ్స్ కు రూ.499 నుంచి రూ.2999 వరకు బట్టలు లభిస్తాయి అన్నారు. సంవత్సరం పిల్లల నుంచి 16 సంవత్సరాల వయసు గల పిల్లల వరకు, ఆకర్షణీయమైన ఆధునిక పద్ధతుల్లో తయారుచేసిన బట్టలు లభిస్తాయని వెల్లడించారు. దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



రాపిడో డ్రైవర్లకు రివార్డులు ప్రదానం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

రాపిడో యాప్ ద్వారా ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు క్షేమంగా చేరవేస్తున్న డ్రైవర్లకు ఆ సంస్థ రివార్డులను అందజేసింది. తిరుపతిలో తొలిసారిగా జరిగిన ఈ కార్యక్రమానికి ర్యాపిడో సహ వ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ప్రముఖ ప్రయాణ యాప్ రాపిడో, దాని కెప్టెన్ల (డ్రైవర్ల) స్థిరత్వం, అసాధారణమైన సహకారాన్ని గుర్తించి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించిన వారి సేవకు రివార్డులు అందజేస్తున్నామన్నారు. తిరుపతి ప్రాంతంలో సుమారు 250 మంది రాపిడో డ్రైవర్లకు అవార్డులతో పాటు, మైక్రోవేవ్‌లు, స్మార్ట్‌వాచ్‌లు, పవర్ బ్యాంకులు, వైర్‌లెస్ ఇయర్‌ఫోన్‌లు వంటి బహుమతులు అందించామన్నారు.



శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలో 'స్కంబర్గ్' కంపెనీ

ప్రజాశక్తి - క్యాంపస్

కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో మెకానికల్ విద్యార్థినిలను ఆన్లైన్ ద్వారా నిర్వహించిన రాత పరీక్షలో ఉత్తీర్ణులైన 17 మంది విద్యార్థినిలను టెక్నికల్, హెచ్ ఆర్ ఇంటర్వ్యూ నిర్వహించడానికి స్కంబర్గర్ కంపెనీ నుండి సీనియర్ హెచ్‌ఆర్ మేనేజర్ ఫియానా మహిళా యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీకి విచ్చేశారు. విద్యార్థినీలను రెండు గ్రూపులుగా విభజించి ఆన్లైన్లో టెక్నికల్ రౌండ్ నిర్వహించారు. టెక్నికల్ విభాగంలో ఉత్తీర్ణులైన విద్యార్థినీలను హెచ్‌ఆర్ మేనేజర్ పియానో ఇంటర్వ్యూ నిర్వహించి ముగ్గురు విద్యార్థినిలను 8 లక్షల వేతన ప్యాకేజీతో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజిని మాట్లాడుతూ యూనివర్సిటీ ఇండస్ట్రీ కోలాబరేట్ అవ్వాలని, ఆర్థికంగా వెనుకబడిన స్టూడెంట్స్ కి ఇంటెన్షిప్, స్కాలర్షిప్స్ ఇచ్చి ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్లేస్మెంట్ అధికారి ప్రొఫెసర్ బి. కిషోరీ, ఫార్మర్ ప్లేస్మెంట్ అధికారి ప్రొఫెసర్ ఉష, కోఆర్డినేటర్ ఈ. రమేష్ బాబు, బి. మాధవి, ఉమ పాల్గొన్నారు.

తిరుపతిని రాజధానిగా ప్రకటించాలి : చింతామోహన్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతిని రాజధానిగా ప్రకటించాలన్న డిమాండ్‌తో ప్రజాబ్యాలెట్ నిర్వహిస్తామని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ వ్యాఖ్యానించారు. గురువారం ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా తిరుపతి నగర పరిధిలో చింతామోహన్ పర్యటించి ప్రజలతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షులు యార్లపల్లి గోపి, ఎన్ఎస్‌యూఐ నాయకులు జావేద్ పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తి విద్యార్థి దశలోనే వెల్లివిరియాలి

హాకీ క్రీడాకారిణి రజని

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థి దశనుంచే క్రీడా స్ఫూర్తి వెల్లువిరియాలని ప్రముఖ భారత మహిళా హాకీ క్రీడాకారిణి ఈ రజని అన్నారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని నింపాలనే భాగంగా టిటిడి శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన 'స్ఫూర్తి' కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇస్తే రెండిటిలో రాణిస్తారని సూచించారు. క్రీడల వల్ల జీవితంలో టీమ్ స్పిరిట్, ఎనర్జీ, హార్డ్ వర్క్ లక్షణాలు, ఆత్మగౌరవం శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయని, క్రీడలు శారీరక వ్యాయామం, మానసిక చురుకుదనాన్ని కలిగి స్థాయిని, కళాశాలల నుండి ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి కష్టించి అనేక మంది క్రీడాకారులు ప్రపంచ స్థాయిలో పేరు గడించాలని, ప్రస్తుత క్రీడాకారులు ఆ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ సి ప్రకాష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో ఉన్నత స్థానాలకు చేరాలనే వారికి మన జిల్లాకు చెందిన రజని జీవిత కథనే స్ఫూర్తిదాయకం కావాలన్నారు. అనంతరం రజని, వారు మాతృ మూర్తిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ముస్తాక్ అహ్మద్, జానకిరామి రెడ్డి, ఎస్వీ జూనియర్ కళాశాల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హాకీ క్రీడాకారిణి రజని

సంక్షేమ నిధుల దారి మళ్లింపు అన్యాయం

సమావేశంలో భవన నిర్మాణ కార్మికుల ఆవేదన

ప్రజాశక్తి - సత్యవేడు: ప్రభుత్వం ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను దారి మళ్లించి కార్మికులకు అన్యాయం చేస్తోందని (సిఐటియు) భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు బాబు అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ నిధులను ప్రభుత్వం పక్కదారి పట్టించడం అన్యాయమన్నారు. ఆ సంఘం కార్యదర్శి తిరుమలరెడ్డి మాట్లాడుతూ దారి మళ్ల తున్న సంక్షేమ నిధుల కోసం అనేక దఫాలు రకరకాల పోరాటం ద్వారా ప్రభుత్వాన్ని భవన నిర్మాణ కార్మికు లు అనేక కుటుంబాలు తీవ్రమైన ప్రమాదాలకు గురై కుటుంబాలు అనేక ఇబ్బందులకు గురవుతు న్నాయన్నారు. ఈ ప్రభుత్వం ప్రభుత్వ సంక్షేమ బోర్డ ను కార్మికుల సంక్షేమానిక సక్రమంగా వినియో గించా లన్నారు. జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమ లు చేయకుండా నవరత్నాలు పేరుతో కార్మికుల బాగోగులు సరి చూడకుండా లేబర్ డిపార్టుమెంటు పేరుతో లైసెన్సు గాని కొత్త కార్డులు గాని పూర్తిగా నిర్వీర్యం చేసి కార్మికుల సంక్షేమాన్ని దెబ్బతీసేలా ప్రభుత్వ విధానం వుండ కూడదన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికు లు శేఖర్ ఏలుమలై, సుబ్రమణి బాలయ్య, కార్తీక్, రోస్ మనీ, గోవిందయ్య, మునస్వామి, ప్రదీప్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భవన నిర్మాణ సంఘం కార్మికులు

సమస్యలు పరిష్కరించండి

మండల విద్యాధికారికి మధ్యాహ్న భోజన కార్మికుల వినతి

ప్రజాశక్తి -నాయుడుపేట: తమ సమస్యలు పరిష్క రించాలని కోరుతూ ఎంఈఓకి మధ్యాహ్న భోజన కార్మికులు గురువారం అర్జీ సమర్పిం చారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె విజయమ్మ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారానికి రాకముందు పాదయాత్రలో మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు 10వేల రూపాయలు వేతనం ఇవ్వాలని, సదుపాయాలు కల్పించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కానీ అధికారం పూర్తి కావస్తున్నా ఇప్పటి వరకు ఇచ్చిన హామీలు ఏవీ నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరిం చాలని, మెనూ చార్జీలకు 20 రూపాయలు ఇవ్వాలని కోరారు. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, అమలకు కనీసం మౌలిక సదుపాయాలు కల్పించా లని, గుర్తింపు కార్డులు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలి కోరారు. మధ్యాహ్న భోజన పథకం ప్రైవేటు సంస్థలకు అప్ప చెప్పకూడదని కోరారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, వంట సమయంలో అగ్ని ప్రమాదం జరిగినా వారికి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. మట్టి ఖర్చులు దహన సంస్కారాలకు ఆర్థికసాయం అందించా లన్నారు. హైస్కూల్లో పనిచేస్తున్న వారికి వేతనం, సెలవులు ఇవ్వాలని, మెటర్నిటి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. సంవత్సరానికి 2 జతలు యూనిఫామ్ ఇవ్వాలని, 2నెలలకు ఒకసారి ఎంఈఓ లు సమావేశ పరచాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్నం భోజన కార్మికులు కే వాణి, రజియా, వెంకటేశ్వర్లు, లక్ష్మీ పాల్గొన్నారు.


ఎంఈవోకు అర్జీ అందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

విద్యారంగాన్ని పరిరక్షించుకుందాం

- పిడిఎస్‌ఓ పుస్తకాల ఆవిష్కరణ సభలో వక్తల పిలుపు

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యా రంగాన్ని పరిరక్షించు కోవాలని పిడిఎస్ఓ నాయకులు పేర్కొన్నారు. పిడిఎస్‌వో ప్రచురించిన 'సామాజిక సంక్షోభపు సుడి గుండంలో విద్యారంగం", 'విదేశీ విశ్వవిద్యాల యాలకు అనుమతులు – ఉన్నత విద్యకు దూరమవుతున్న అట్టడుగు వర్గాల విద్యార్థులు' అనే పుస్తకాలను నేడు పిడిఎస్ఓ ఆధ్వర్యంలో తిరుపతిలోని అంబేద్కర్ భవన్‌లో గురువారం ఆవిష్కరించారు ఈ సభకు పిడిఎస్ఓ తిరుపతి జిల్లా కార్యదర్శి ఆర్.ఆశ అధ్యక్షత వహించారు. సీనియర్ జర్నలిస్టు ఏ.రాఘవ శర్మ ఈ పుస్తకాలను ఆవిష్కరించారు. ఏ.రాఘవ శర్మ మాట్లాడుతూ ఒకవైపున రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో, కాలేజీల్లో, యూనివర్సిటీలలో అనేక సమస్యలు నెలకొని ఉండగా వాటిని పరిష్కరిం చకుండా న్యూ ఎడ్యుకేషన్ పాలసీ పేరుతో ఆన్లైన్ విద్యా విధానం వంటి అనేక లోపాలు కలిగిన విధానాలను అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. సామాజిక శాస్త్రాలకు విద్యలో చోటు లేకుండా చేస్తున్నారు. శాస్త్రీయ, స్వతంత్ర, ప్రజాతంత్ర విద్యా విధానం కోసం పోరాడుతున్న పిడిఎస్ఓతో విద్యార్థులు చేతులు కలపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వక్తలు జిల్లా రిటైర్డ్ జడ్జి పి. గుర్రప్ప మాట్లా డుతూ విద్యా విధానంలో నేడున్న లోపాలను విద్యార్థులు అర్థం చేసుకొని విద్యార్థులు వాటిని ప్రశ్నిం చాల్సిన సమయం సరైన విద్యా విధానాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో డి గోవిందులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డా.కాంతారావు, అడ్వకేట్ జయచంద్ర, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి గెలుపుతోనే బీసీలకు బంగారు భవిష్యత్: పులివర్తి నాని

ప్రజాశక్తి- రామచంద్రాపురం (చంద్రగిరి) : టిడిపి అధినేత రామారావు బిసిలకు పెద్దపీట వేశారని, తర్వాత చంద్రబాబు నాయుడు 34 శాతం రిజర్వేషన్లు కల్పించి బీసీల అభ్యున్నతికి కృషి చేశారని చిత్తూరు జిల్లా పార్లమెంటు అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. గురువారం చంద్రగిరిలోని ఓ ప్రైవేట్ కళ్యాణ మంటపంలో జయహో బిసి సభను నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి పులివర్తి నాని, బీసీ నేత సిఆర్ రాజన్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మొదట జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పులివర్తి నాని మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం 24 శాతం తగ్గించిందన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సోదరుడు రఘునాథ్ రెడ్డి ఇసుక అక్రమ రవాణా, హాథిరాంజీ మఠం భూములను అన్యాక్రాంతం చేసి అమ్మి, దొంగ రిజిస్ట్రేషన్లు , మట్టి మాఫియా చేసి అక్రమ సంపాదనకు పాల్పడుతు న్నారని ఆరోపిం చారు. చంద్రగిరిని గంజాయి వనంలా తయారు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 'ఒక్కసారి అవకాశం ఇవ్వండి... అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఈ సమావేశంలో మండల టిడిపి అధ్యక్షు లు వి సుబ్రమణ్యం నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్ బాషా, మాజీ జడ్పిటిసిలు వీరంగారి రమేష్ రెడ్డి, బాపన పట్టు అమ్ములు, దుబాసి రామ్మూర్తి, మణి యాదవ్, చంగల్రాయ ఆచారి,వెంకటేష్ యాదవ్, సింగు సుధా, లంకెళ్ళ లలిత,టిడిపి , జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పులివర్తి నాని

శ్రీకాళహస్తి: బీసీల ద్రోహి ముఖ్యమంత్రి జగన్ అనీ, వారిని అన్ని రకాలుగా అణగదొక్కేందుకు ఆయన కుట్ర చేశాడని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి విమర్శించారు. తొట్టంబేడు లో గురువారం జయహో బీసీ నిర్వహించారు. టిడిపి కార్యకర్తల మృతికి ముందుగా నివాళులు అర్పించారు. జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల కాలంలో బీసీలకు చేసిన మేలు సున్నా అనీ, టిడిపి హయాంలో బీసీలకు అగ్ర తాంబూలం వేశారని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో బీసీలు జగన్‌కు గట్టిగా బుద్ధి చెప్పాలని పిలు పునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతి నాయుడు, డా.జి.దశరధాచారి, రెడ్డివారి గురవారెడ్డి, మండల బిసి అధ్యక్షులు సురేంద్ర యాదవ్, బిసి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామి యాదవ్ పాల్గొన్నారు.

తహశీల్దారును సస్పెండు చేయాలని నిరసన

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): దళిత బడుగు బలహీన వర్గాల వారిపై వివక్ష చూపుతున్న ఎమ్మార్వో శిరీషను సస్పెండ్ చేయాలని సిపిఐ ఎమ్మెల్ రెబరేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి పి సత్తార్,,ఆమ్ ఆద్మీ పార్టీ చంద్రగిరి ఇంచార్జ్ ఐరాల లోకేష్ లు డిమాండ్ చేశారు. గురువారం చంద్రగిరి బస్టాండ్ కూడలిలో గల టవర్ క్లాక్ దగ్గర ఎమ్మార్వో శిరీష చర్యల కు నిరసనగా నినాదాలు చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, టి వెంకటేశు, సుజాత, గంగమ్మ, మల్లార్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు శేఖర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే సేవ చేస్తా: నేదురుమల్లి

ప్రజాశక్తి -బాలాయపల్లి : ' నేదురుమల్లి రాజ్యలక్ష్మి, జనార్ధనరెడ్డి తనయుడిని మీ బిడ్డగా ముందుకు వస్తున్నాను.. సేవచేసేందుకు భాగ్యం కల్పించండి మీకుసేవచేస్తాను..' అంటూ ఆంధ్రప్ర దేశ్ కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డ్ చైర్మన్ తిరు పతి జిల్లా వైసిపి అధ్యక్షుడు, వెంకట గిరి నియోజకవర్గం కన్వీనర్ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండ ల కేంద్రంలో ఉన్న సచివాలయం ప్రాంగణంలో మండల పార్టీ అధ్యక్షుడు వెందోటి. కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో పొదుపు మహిళలకు ఆసరా పథకం ద్వారా అందించే చెక్కు పంపిణీ చేశారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మన ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చెప్పిన విధంగానే సుమారు78.98 లక్ష స్వయం సహాయక సంఘా లోని సుమారు 78.94 లక్షల మంది అక్క చెల్లెమ్మ ల ఖాతాలో వైయస్సార్ ఆసరా పథకం ద్వారా జమవుతుందన్నారు.

ఆర్థిక సాయం జగన్ కే సాధ్యం పేదలు ఆర్థికంగా వెనక పడుతు న్నారని ఆలో చించి వెంటనే ఆర్థిక సాయం ప్రతి కుటుంబానికి అందించిన వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి అని కొన్నిసార్లు. నేను ఏడాది పాటు 76 వేలు కుటుం బాలు గడపలను సందర్శిం చామన్నారు. ప్రతికుటుంబంకు సంక్షేమ పథకాలు అందడంపై ప్రజలు అర్థం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విద్యార్థిని విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ఉత్సాహంగా పాల్గొని రాణించినప్పుడే ఆరోగ్యంగా ఉంటారని కేకేసి కళాశాల ఛైర్మన్ కె కుప్పయ్య శెట్టి పేర్కొన్నారు. స్థానిక కెకెసి ఫిజియోథెరపి కళాశాల విద్యార్థులు డాక్టరు వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ అంతర్ కళాశాల స్పోర్ట్స్, కల్చరల్స్ పోటీల్లో వాలీబాల్ విభాగంలో 2వ స్థానంలో నిలిచారు. క్రీడలు ముగిసిన తరువాత కళాశాలకు విచ్చేసిన విద్యార్థులకు కళాశాల ఛైర్మన్ కె కుప్పయ్య శెట్టి, వైస్ ఛైర్మన్ కే నరసింహారావు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి అనంతరం విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కె కుప్పయ్య శెట్టి మాట్లాడుతూ విద్యార్థిలు క్రమశిక్షణ అలవరుచుకుని క్రీడల లో రాణించా లన్నారు. వైస్ ఛైర్మన్ మాట్లా డుతూ కళాశాల ప్రాంగణం లో క్రీడల పోటీలు నిర్వహణకు అన్ని సౌకర్యాలు కల్పిస్తా మని హామీ ఇచ్చారు. అనంతరం ఫిజి యో థెరపి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు మహేష్ మాట్లాడుతూ విద్యార్థు లు పుత్తూ రుకు గౌరవం, గుర్తింపు తీసుకు రావడాన్ని కొనియా డారు. కళాశాల పిఇటి మాబు సుభాని కృషిని అభినం దించారు.


వాలీబాల్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించిన కెకెసి కళాశాల విద్యార్థులు

ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టరు రెడ్డి కుమార్, వాలీబాల్ టీమ్ కెప్టెక్ నవీన్, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. డాక్టరు లోకేష్, డాక్టరు ఝాన్సీరాణి, రాజేంద్రప్రసాద్ ఎట బాలాజీ పాల్గొన్నారు.

తిరుపతి అడిషనల్ కమిషనర్‌గా సి చరణ్ తేజ్ రెడ్డి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: గత ఆరు నెలలుగా ఖాళీగా ఉన్న తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ పోస్టును రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసింది. గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అడిషనల్ కమిషనర్‌గా సి చరణ్ తేజ్ రెడ్డిని నియమించారు. ఈయన స్టేట్ ఆడిట్ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్నారు. రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ తిరుపతి అడిషనల్ కమిషనరుగా చరణ్ తేజ రెడ్డి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే అడిషనల్ కమిషనర్‌గా అమరయ్యను నియమించిన విషయం విదితమే.

డిస్కం ఇఇకి ఘన సన్మానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు డివిజన్ లో సుదీర్ఘ కాలంగా డిస్కం ఇఇగా ఇస్మాయిల్ అహ్మద్ పనిచేస్తూ ఏపీ ఎస్పీడిసిఎల్ ఎస్ఈ గా ఉద్యోగోన్నతి పొందడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా ఏపీఈఈ యూనియన్ ఆధ్వర్యంలో ఇఇ ఇస్మాయిల్ అహ్మద్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డివిజనల్ అధ్యక్షుడు శ్రీధర్‌రాజు మాట్లాడుతూ విద్యుత్ శాఖలో ఎప్పటి కప్పుడు సమస్యలు పరిష్కరిస్తూ, మెరుగైన సేవలు అందించారని కొనియాడారు. ఆయకు ఉద్యోగోన్నతి రావడం సంతోషంగా వుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ సెక్రెటరీ శివ శంకర్ , సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలు రైతుకు శ్రేష్టం

ప్రజాశక్తి -బాలాయపల్లి : ఉద్యాన పంటలు రైతుకు ఎంతో లాభదాయకమని కెవికె అధిపతి డాక్టరు బి గోవింద రాజులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని మన్నూరులో రైతు సదస్సు, ఉద్యాన ప్రదర్శన కృషి విజ్ఞాన కేంద్రం, పెరియవరం, వెంకటగిరి వారు గ్రామీణ ఉద్యాన అనుభావ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన పంటలు రైతులకు పెట్టుబడి తక్కువ లాభం ఎక్కువన్నారు. ఉద్యాన కళాశాల అనంతరాజుపేట అసోసియేట్ డీన్ డాక్టరు కె గోపాల్ మాట్లాడుతూ విద్యార్థుల నమూనాల గురించి అడిగి తెలుసుకొని, దత్తత రైతులకు ఉద్యాన విద్యార్థులు అందించిన సాంకేతికతను అభినందించారు. ఉద్యాన విద్యార్థులు రైతులతో పనిచేసిన విధానాన్ని అభినందించారు. ఈ కార్యక్రమాన్ని కెవికె ఉద్యాన శాస్త్ర వేత్త డాక్టరు డి తిరుపాల్ నిర్వహించారు. ఈ సదస్సులో ఉద్యాన కళాశాల, అనంతరాజుపేట ప్రొఫెసర్ డాక్టరు రామయ్య, సహాయ ఆధ్యాపకుడు డాక్టరు విరేష్, కెవికె శాస్త్రవేత్తలు డాక్టరు విజయ్ , డాక్టరు పి. నాగార్జున రెడ్డి, ఐ రాజీవన, బాలాయపల్లి ఉద్యాన అధికారి ఆనంద రెడ్డి , పల్లిపడు, మన్నూరు రైతులు, మహిళలు పాల్గొన్నారు.

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : 'బాబు ష్యూరిటీ -భవిష్యత్ గ్యారెంటీ ఇంటింటికి ప్రచారంలో భాగంగా గూడూరు పట్టణం 2 వ వార్డు లోని బనిగి సాహెబ్ పేట ప్రాంతంలో వార్డు నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరిగారు . అనంతరం టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి గురించి వివరించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి కి ఓటు వేసి గెలిపించాలన్నారు. ఆమె వెంట మాజీ కౌన్సిలరు నూర్జహాన్, అలీ హుస్సేన్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోట: టిడిపి ఆధ్వర్యంలో గురువారం ప్రజా చైతన్యం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి విజయానికి కృషి చేస్తామని కర్లపూడి గ్రామస్తులు అన్నారు. ఈ సందర్భంగా కోట మండలం కర్లపూడి గ్రామానికి చెందిన పలువురు టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలవడంతో వారందరికి టిడిపి కండువాలు కప్పారు. ఈ కార్యక్రమంలో కర్లపూడి టిడిపి నాయకులు జరుగుమల్లి కోటేశ్వర రావు, మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్, పేర్నాటి కరుణాకర్ రెడ్డి, పేర్నాటి శ్రీనివాసులు రెడ్డి, కర్లపూడి శ్రీనివాసులు, కర్లపూడి రాంబాబు, వెంకట కృష్ణయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'వచ్చేది ప్రజా ప్రభుత్వమే': జనసేన

ప్రజాశక్తి -గూడూరు రూరల్: వచ్చేది ప్రజా ప్రభుత్వమేనని ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్ర శేఖర్ రావు అన్నారు. పట్టణంలోని నర్సయ్యగుంట, సనత్ నగర్ ప్రాంతాలలో గురువారం జనంలోకి జనసేన, భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో నిత్యావసర సరుకులతో పాటు విద్యుత్ , బస్ ఛార్జీలు విపరీతంగా పెంచారని దీంతో సామాన్యులు ఇబ్బందులు పాలవుతున్నారు. ఎప్పుడు ఎన్నికలు వస్తాయా...జగన్మోహన్ రెడ్డిని ఇంటికి పంపుతామా? అని ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. రాబోయేది జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రజా ప్రభుత్వమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు పెద్దిసెట్టి ఇంద్రవర్థన్, నాయకులు ఉప్పు సాయి కిరణ్, శివ కుమార్, సనత్, వెంకటేశ్వర్లు, హర్ష, పెంచలయ్య వసంత్, రహమాన్, సబ్బు, ఓంకార్, షారు, క్రాంతి పాల్గొన్నారు.

కమిషనర్ బంగ్లా నిర్మాణాన్ని పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: నిర్మాణంలో వున్న కమిషనర్ బంగ్లాను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ అధికారులకు సూచించారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ ప్రాంగణంలోని మునిసిపల్ కార్పొరేషన్ స్థలంలో తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ కోసం నిర్మిస్తున్న బంగ్లా నిర్మాణ పనులను గురువారం సాయంత్రం కమిషనర్ పరిశీలించారు. ఇప్పటికే మొదటి స్లాబ్ పూర్తి అయ్యిందని, రెండవ స్లాబ్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. కమిషనర్ బంగ్లా స్లైన్ ని పరిశీలిస్తు పనులు వేగవంతం చేసి, సకాలంలో పూర్తి చేయాలని కమిషనర్ సూచించారు. ఆయన వెంట తిరుపతి నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమలిశెట్టి మోహన్, మునిసిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారి సేతుమాధవ్ వున్నారు.

ఉద్యోగుల పక్షపాతి సీఎం: మురళి రెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రంలోని యూనివర్సిటీలలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బందికి పదవీ విరమణ వయసు 60 నుంచి 62 సంవత్సరాలు పెంచడం ద్వారా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఉద్యోగుల పక్షపాతిగా నిరూపించారని విశ్వవిద్యాలయాల బోధనేతర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె. మురళి రెడ్డి పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పరిపాలన భవనం ఎదుట గురువారం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో వైయస్సార్ ఆల్ యూనివర్సిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలుపుతూ పాలాభిషేకం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సభ్యులు అజీమ్, ముత్యాలు, భరత్ రెడ్డి, లీలా కృష్ణారెడ్డి, బిల్లా, మదం గిరిబాబు, ప్రకాష్, హాస్టల్ ఎన్ఎంఆర్ క్యాంపస్ అధ్యక్షులు గౌతమ, కార్యదర్శి లోకేష్, గౌరీ, ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్: బెక్ ఫెస్ట్ పోస్టర్లను ఉపకులపతి ప్రొఫెసర్ డి.భారతి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. రజని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఈ.టి డైరెక్టర్ ప్రొఫెసర్ పి.మల్లికార్జున, ప్రొఫెసర్లు, విభాగాధిపతి, కోఆర్డినేటర్లు, అధ్యాపకులు, విద్యార్థి కన్వీనర్లు, కో-కన్వీనర్లు పాల్గొన్నారు.

తాగు నీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి -ఏర్పేడు : మండలంలోని జంగాలపల్లి గ్రామ పంచాయతీ దళితవాడలో సర్పంచ్ బుర్ర నారాయణ ఆధ్వర్యంలో చేతి పంపు బోరు మరమ్మతులు చేపట్టారు. పైపులు మొత్తం తుప్పు పట్టడంతో మొత్తం పైపు లను, పుట్‌బాల్‌ను మార్చి చేతి పంపు మరమ్మతులు చేపట్టి నీటి సమస్యను పరిష్కరించారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతున్న మురళీ బాలుడు భానుప్రకాష్ చికిత్స కోసం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత గురువారం రూ.20 వేలు ఆర్థిక సాయం చేశారు. ఇందులో జనసేన భాగంగా తొట్టంబేడు మండలం కాసరం గ్రామానికి వెళ్లిన వినుతకు భానుప్రకాష్ తల్లిదండ్రులు తమ బిడ్డ పరిస్థితులను వివరించారు. స్పందించిన ఆమె బాలుడి చికిత్స నిమిత్తం తనవంతు సాయం అందించారు. జనసేన-టిడిపి ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే భాను ప్రకాష్ కు అయ్యే వైద్య ఖర్చులన్నింటినీ తామే భరిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతానికి చెన్నై ఎగ్మోర్ హాస్పిటల్ లో ఉచిత చికిత్స కి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తొట్టంబేడు మండల ఇంచార్జి పేట చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

వైసీపీతోనే వన్నె రెడ్ల అభివృద్ధి : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి -ఏర్పేడు: ఇప్పటివరకు వన్నె రెడ్లకు ఏ ప్రభుత్వం ఇవ్వని గుర్తింపు వైసిపి ప్రభుత్వం ఇచ్చిందని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఏర్పేడు మండలం దుర్గ పేట గ్రామంలో వన్నె రెడ్ల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో వన్ల తంగాక్ బాలాజీ రెడ్డి, సర్పంచ్ ముని రామయ్య, జి ముని రెడ్డి, రత్నం రెడ్డి, బాలకృష్ణ, దాము పాల్గొన్నారు.

క్రైం న్యూస్

భార్య హత్య కేసులో నిందితుడి అరెస్ట్

ప్రజాశక్తి - ఓజిలి: భార్యను హత్య చేసిన కేసులో నిందితుడిని పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. ఓజిలి పోలీస్ స్టేషన్లో నాయుడుపేట డీఎస్పి ఎం రాజగోపాల్ రెడ్డి వివరాలు వెల్లడించారు. డీఎస్పి మాట్లాడుతూ మండల పరిధిలోని వీర్లగునపాడు గ్రామానికి చెందిన వల్లూరు దొరసానమ్మ భర్త శివకుమార్ భార్యపై అనుమానం పెంచుకున్నాడు. భార్యను హతమార్చాలని ఉద్దేశ పూర్వకంగా గత నెల 28 తేదీ కట్టెల కోసం అడవికి తీసుకెళ్లి తనతో తెచ్చుకున్న మొచ్చు కత్తితో కిరాతకంగా హతమార్చాడు. అడ్డువచ్చిన మరో మహిళా మంజులమ్మను గాయపరిచి అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికుడు మురళి ఫిర్యాదు మేరకు సమాచారం తెలుసుకున్న నాయుడుపేట రూరల్ సిఐ.డి జగన్మోహన్ రావు , ఇన్చార్జి ఎస్ఐ తిరుమలరావు పరారీలో ఉన్న ముద్దాయిని నాయుడుపేట మండలం పండ్లూరు గ్రామం వద్ద బుధవారం సాయంత్రం కాపుకాశి చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. ముద్దాయిని గురువారం కోర్టుకు హాజరుప్రస్తునట్లు తెలియజేశారు. ఈ కేసును త్వరితగతిన చేదించడంలో కృషిచేసిన సీఐ జగన్మోహన్ రావు, ఎస్సై తిరుమల రావు , హెడ్ కానిస్టేబుల్ నాగరాజు , కానిస్టేబుళ్లు మోహన్, గోవర్ధన్ ,వెంకటేశ్వ ర్లు, సుధాకర్ , వెంకటేష్ లను డీఎస్పి రాజగోపాల్ రెడ్డి అభినందించారు.

వాలంటీరు ఇంట్లో చోరీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండో పట్టణ పరిధిలోని 25వ వార్డు ఇందిరా నగర్‌లో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. వాలంటీరుగా విధులు నిర్వహిస్తున్న దీపిక. ఇంటికి తాళాలు వేసి సమీపంలో ఉన్న తల్లి ఇంటికి వెళ్లారు. తన భర్త లేని రోజుల్లో ఆమె తల్లి వద్దనే ఉంటోంది. ఇది గుర్తించిన దొంగలు రాత్రి తాళాలు పగుల గొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. ఇంట్లో దాచిన లక్షా 64 వేల రూపాయల నగదుతో పాటు కొన్ని వెండి వస్తువులను అపహరించి ఉడాయించారు. పక్కనే ఇంట్లో కూడా చోరీకి యత్నించారు. కానీ వస్తువులు అపహరించలేదని తెలిసింది. యథావిధిగా గురువారం ఇంటికి వెళ్లిన వాలంటీరు దీపిక చోరీ జరిగిందని గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆకతాయిల ఆగడాలతో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఆకతాయిల ఆగడాలతో అగ్ని ప్రమాదం సంభవించిన సంఘటన తిరుపతిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు మహతి ఆడిటోరియం ఎదురుగా ఉన్న ఆటోమొబైల్ షాప్ వెనుక ఉన్న టైర్లకు కొంతమంది ఆకతాయిలు నిప్పు పెట్టడంతో భారీగా అగ్నికీలలు ఎగసి పడ్డాయి. పక్కనే ఉన్న రెండు ఏసీ అవుట్‌డోర్ యూనిట్లు సైతం అగ్నిగి ఆహుతయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తేవడంతో భారీ ప్రమాదం తప్పింది. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనధికార వాహనాల్లో రూ.5కోట్ల నగదు సీజ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వాహన తనిఖీల్లో భాగంగా సరైన ధ్రువీకరణ పత్రాలు లేని భారీ నగదును గూడూరు పోలీసులు స్వాధీ నం చేసు కున్నారు. సుమారు ఐదు కోట్ల12 లక్షల 91 వేల 180 రూపాయల నగదును స్వాధీనం చేసుకొని ఆరుగు రు నిందితులను అదుపు లోకి తీసుకున్నారు. గూడూరు ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి సూర్య నారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ ఆరుగురు వ్యక్తులు విజయవాడ నుండి చెన్నై వైపు వాహనాల్లో నగదును తరలిస్తుండగా అదుపులోకి తీసు కున్నామన్నారు. చిల్లకూరు జాతీయ రహదారిపై గూడూరు పట్టణం, గూడూరు రూరల్ ప్రాంతాల్లో వాహనాల్లో తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు ముమ్మరం చేశామని పేర్కొన్నారు. పట్టుపడ్డ నగదును ఇన్‌కమ్ టాక్స్ అధికారులకు అప్పగిస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం పట్టుకున్న సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఒకటవ పట్టణ సీఐ పాపారావు , రూరల్ సీఐ వేణుగోపాల్ రెడ్డి , రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్, చిల్లకూరు ఎస్ఐ అంజి రెడ్డి , సిబ్బంది పాల్గొన్నారు.


5 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు

ట్రాక్టరును ఢీకొని ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి- ఏర్పేడు: ఏర్పేడు మండలం డిక్సన్ సమీపంలో ని ఏపీఐఎస్పి బిల్డింగ్ వద్ద బీహార్‌కు చెందిన ముగ్గురు యువకులు స్కూటర్‌పై ప్రయాణిస్తుండగా ట్రాక్టరును ఢీకున్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మరణిం చారు. స్వల్ప గాయలతో బయటపడి మరో వ్యక్తిని అంబులెన్స్ లో హాస్పిటల్ కి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీఐ ఓబులేష్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణ పోలీస్ స్టేషన్‌లో సిఐ ఓబులేషు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఉన్న సిఐ ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు బదిలీపై వెళ్లారు. ఓబులేషు పాకాల నుంచి పుత్తూరుకి బదిలీ కావడంతో సిఐగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో శాంతి భద్రతలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పట్టణ ప్రజలు సహాయ సహకారాలు అందించాలన్నారు. రోడ్డు భద్రతపై జాగ్రత్తలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలపై వైసిపి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): వైసిపి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే చెవిరెడ్డి అభివృద్ధి పనుల పట్ల గడప గడపకు విస్తృత ప్రచారం చేయడమే లక్ష్యమని నియోజకవర్గ వైసీపీ యువనేత హర్షిత్ రెడ్డి అన్నారు. మండలంలోని చిన్నరామాపురం పంచాయతీ పరిధిలో గురువారం 'గడపగడపకు మన ప్రభుత్వం'ను చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి నిర్వహించారు. యల్లంపల్లిలో ఇంటికీ వెళ్లి లబ్ధిదారుల సంక్షేమ జాబితాను అందించారు. గ్రామంలో చేసిన ప్రగతి పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, జెడ్పిటిసి యుగంధర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీవో బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

వెంకటగిరి ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్ : వెంకటగిరి ఎంపిడివో నిలకంఠేశ్వరరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల దృష్ట్యా ప్రభుత్వ బదిలీలో భాగంగా చిత్తూరు జిల్లా పెనుమూరు మండలంలో మండల పరిషత్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆయన తిరుపతి జిల్లా వెంకటగిరికి బదిలీ అయ్యారు. మండల పరిషత్ అడ్మిన్స్ట్రేటివ్ ఆఫీసర్ విజయలక్ష్మి సమక్షంలో బాధ్యతలు చేపట్టారు.